# సింగిల్ పేజీ కథలు

# ఆట

కార్తీకమాసంలో వనభోజనాలు కులాల వారీగా ఫంక్షన్ హాళ్లలో జరుపుకోవడం విశ్వేశ్వ ర్రావుకి ఏ మాత్రం నచ్చలేదు. మా అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ మీటింగ్‌లో ఆవేశంగా ప్రసంగించాడు.

"కార్తీక మాసంలో చలి అధికంగా వుంటుంది. వర్షాలు పడే అవకాశం తక్కువే. ఊళ్లో వాళ్లంతా సంవత్సరానికి ఒక్కసారైనా వూరుదాటి పచ్చటి చెట్ల నీడల్లో సామూహికంగా భోజనాలు చేయడానికి వుద్దేశించి ప్రారంభించిందే ఈ వనభోజనాల కార్యక్రమం. ఈ ఒక్క రోజైనా కులాల మధ్య అంతరాలు, ధనిక బీద భేదాలు మర్చిపోయి ఆటపాటలతో కాలక్షేపం చేయడానికి, మనుషుల మధ్య సాన్నిహిత్యం పెరగడానికి దోహదపడుతుంది. కానీ ఈ రోజు ఏం జరుగుతున్నది? అంతా కులాల వారీగా ఫంక్షన్ హాళ్లలో మీటింగుల మాదిరి జరుపుకుంటున్నారు. రాజకీయ నాయకుల్ని, సినిమా యాక్టర్స్‌నీ పిలిచి ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. అసలు వన భోజనాల స్ఫూర్తి మర్చిపోతున్నారు"

"ఐతే ఏం చేద్దామంటావు గురూ?" ఎవరో అరిచారు.

"అదే చెప్పబోతున్నా. మన అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వాళ్లం ప్రత్యేకంగా బస్సు వేసుకుని ఏదైనా పుణ్యక్షేత్రానికి యాత్రకు బయల్దేరదాం. దారిలో ఎక్కడైనా తోటలుంటాయి. అక్కడ ఆగి వనభోజన కార్యక్రమం చేద్దాం. ఉదయం బయల్దేరి సాయంకాలానికి తిరిగి వచ్చేట్లు ప్లాన్ చేద్దాం ఎవరికీ ఇబ్బంది వుండదు. మనల్ని చూసి కాలనీలో చాలామంది ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది" అన్నాడు విశ్వేశ్వర్రావు.

"ఒకే... డన్" అంతా చప్పట్లు కొట్టారు.


అపార్ట్‌మెంట్ సెక్రటరీ రామనాథం చొరవ తీసుకుని ఒక ప్రైవేటు బస్సు మాట్లాడాడు. భోజనాలు, ఫలహారాలు ఆర్యభవన్ హోటల్‌కి ఆర్డర్ చేశాడు. ఉదయం ఏడింటికంతా పులిహోరా, చక్కెర పొంగలి, దద్దోజనం ఫలహారం క్రింద చేసేట్లు, మధ్యాహ్నం భోజనం, స్వీట్లు, వగైరా రెడీ చేసి ఇచ్చేట్లు ఒప్పందం జరిగింది.

మా అపార్ట్‌మెంట్ ముందు ఉదయం ఆరింటికి స్పెషల్ బస్సు ఆగగానే అంతా ఎంక్వయిరీలు మొదలుపెట్టారు. 'ఎక్కడికి వెళ్తున్నారు?' 'ఏదైనా పెళ్ళా?' 'ఏ వూరు?' 'ఎవరి పెళ్ళి' అంటూ అడగడం సాగించారు చుట్టు పక్కల అపార్‌మెంట్లవాళ్లు.

ఈసారి విశ్వేశ్వర్రావుతో పాటు, సెక్రటరీ రామనాథం కూడా కార్తీకమాసం వనభోజనాల స్ఫూర్తి గురించి అడిగిన వారికి, అడగని వారికి కూడా క్లాసు పీకారు.

'ఆహాఁ.. ఓహోఁ..' అన్నారు కొందరు.

'గుడ్ ఐడియా' అని మెచ్చుకున్నారు మరి కొందరు.



ముందే అనుకున్నట్లుగా బస్సు వేములవాడ బయల్దేరింది. ఉదయం తొమ్మిది దాటాక ఒక మామిడి తోట కనిపించింది. ప్రక్కన బస్సు ఆపి తోటలో మామిడి చెట్ల క్రింద పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం తిన్నారు. తోటమాలి అరటి ఆకులు కోసుకొచ్చి ముక్కలు చేసి బాగా సహకరించాడు.

వేములవాడ వెళ్లి స్నానాలు చేసి, దైవ దర్శనం అయ్యాక బస్సులో బయల్దేరి దారిలో ఒక తోటలో భోజనాలు చేశారు. వెళ్ళేటప్పుడే వాటర్ కేన్‌లు, డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు తీసుకెళ్ళడంతో ఏ ఇబ్బందీ లేకుండా జరిగింది. ఏర్పాట్లు బాగా చేశారని అంతా సెక్రటరీ రామనాథాన్ని మెచ్చుకున్నారు.

భోజనాలయ్యాక మళ్ళీ బస్సు బయల్దేరింది. దారిలో రోడ్డు ప్రక్కన చిన్న హోటల్ కనిపించి డ్రైవర్ బస్సు ఆపాడు. అప్పటికి సాయంకాలం నాలుగైంది. ఎవరైనా అలవాటున్నవాళ్ళు టీ, కాఫీలు తాగమన్నాడు డ్రైవరు. ఆడవాళ్లు కాఫీలు తాగుతుంటే, పిల్లలు పక్కనే వున్న టమాటా పొలంలోకి వెళ్ళారు. టమాటాలు విరగకాసి ఎండకి ఎర్రగా మెరుస్తున్నాయి. పెద్దవాళ్ళు వద్దంటున్నా పిల్లలు ఎర్రటి పళ్లు కోసుకుని తినడం మొదలుపెట్టారు.

అక్కడ పశువులు కాస్తున్న యువకుడు గూడా 'కోసుకోనీయండి సారూ!' అన్నాడు.

వచ్చేటప్పుడు బస్సు టాప్‌మీద పది ప్లాస్టిక్ కుర్చీలు తెచ్చారు. మ్యూజికల్ ఛైర్స్ ఆడుకోవాలని. ఖాళీ స్థలంలో కుర్చీలు వేసి ముందు మగవాళ్ళు మ్యూజికల్ ఛైర్ ఆట మొదలుపెట్టారు. ఇది ఎప్పటిదో తాతలనాటి ఆట, ఏమంత ఇంట్రెస్టిగా వుండదని ఎవరూ సరిగా స్పందించలేదు.

"సార్! నేనొక ఆట చెప్తాను సార్! మీకు కొత్తగా వుంటది. మజా వస్తది" అన్నాడు పశు

వులు కాసే కుర్రాడు.

"ఏమి ఆట?" అని సెక్రటరీ అడిగాడు.

"టమాటాలు కోసే ఆట సార్! ఎవరెక్కువ కోస్తే వాళ్ళు గెల్చినట్టన్నమాట" అన్నాడు నవ్వుతూ.

ఆడవాళ్ళు తమలో తాము మాట్లాడుకున్నారు. మగవాళ్ళు గూడా ఇదేదో బాగుందే. వంగి టమాటాలు కోస్తే తిన్నది అరుగుతుంది అనుకున్నారు.

"సరేరా అబ్బాయ్! మేము రెడీ" అన్నాడు సెక్రటరీ.

వాడు అందరికీ తలా ఒక బుట్ట ఇచ్చాడు. సెక్రటరీ టైమ్ చూసి "స్టార్ట్" అన్నాడు.

అంతా టమాటా పొలంలో పడి పండినవి, దోరకాయలు గబగబా కోసి బుట్టల్లో నింపసాగారు. ముప్పైమంది గంటసేపు కోసేసరికి టమాటా పొలంలో కాయలన్నీ బుట్టల్లో నిండాయి.

సెక్రటరీ అందరి బుట్టలూ చెక్ చేసి గంగాధర్ బుట్టలో ఎక్కువ కాయలున్నట్లు నిర్ధారించాడు. రెండో స్థానంలో విశాలాక్షి నిల్చింది. సెక్రటరీ వాళ్ళకి ముందే తెచ్చిన గిఫ్ట్‌ప్యాక్‌లు అందజేశాడు. అంతా చప్పట్లు కొట్టారు.

ఇక చీకటి పడబోతున్నదని అందర్నీ బస్ ఎక్కమన్నాడు సెక్రటరీ. తర్వాత పొలంలో వున్న కుర్రాడి దగ్గరకి వెళ్ళి "నువ్వు చెప్పిన ఆట బాగుందిరా! మా వాళ్ళంతా బాగా ఎంజాయ్ చేశారు" అంటూ వంద రూపాయలు నోటు వాడికి ఇవ్వబోయాడు.

"వద్దు సారూ!" అంటూ ఆ కుర్రాడు మొఖమాట పడ్డాడు.

"ఫరవాలేదు తీసుకో. నీ వల్ల మా వాళ్లంతా బాగా సంతోషించారు" అన్నాడు సెక్రటరీ.

"మాకూ మీ వల్ల సంతోషమే సారూ!" అన్నాడు.

"ఎలా?"

"టమాటాలు కొయ్యడానికి కూలీ వాళ్ళని పెడితే ఐదొందలు అయ్యేది సార్!" అన్నాడు నవ్వుతూ.

సెక్రటరీ బిత్తరపోయాడు.


"ఔను సార్! టమాటాకు రేటు లేదు సార్! కూలీలతో కోయిస్తే గిట్టుబాటుకాదని అట్టనే వదిలేశాడు మా అయ్య. రేపు ఈ బుట్టలు మార్కెట్‌కి బండిలో తోల్తే లాభమే సార్!" అన్నాడు వాడు.

"ఓర్నీ మిమ్మల్నే ఆట ఆడించావు కదరా! పల్లెటూరి వాళ్ళు తెలివితక్కువ వాళ్ళనుకున్నాను. ఇన్ని తెలివి తేటలు ఎక్కడ్నుంచి వచ్చాయిరా బాబూ!" అని గొణుక్కుంటూ బస్సెక్కాడు సెక్రటరీ.

-వాణిశ్రీ (హైదరాబాద్)

# జాజి పందిరి

జాజి పందిరి తీగలతో రెమ్మలతో, పూలతో కళకళలాడుతోంది. దాబా అంతా పాకి



కథా నిలయం శ్రీకాకుళం

పోయింది. చక్కని పందిరి వేసారు. అందరూ కావలసినన్ని పూలు కోసుకుంటున్నారు. ఆ ఇంటావిడ తన స్నేహితురాళ్ళతో వేసవికాలం సాయంత్రాలు జాజి పందిరి కింద ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు. ఆ ఇంటి యజమాని కూడా ఆదివారాలు జాజిపందిరి క్రింద స్నేహితులతో పార్టీలు చేసుకొంటున్నాడు. ఆరోజుకారోజు తీగ అనేక చిన్న చిన్న తీగలతో శోభాయమానంగా ఎదుగుతోంది. గాలివానలకు కూడా పడిపోకుండా దాబా అంచులకు గట్టిగా పెనవేసుకుపోయింది. ఆ ఇంటివాళ్ళ కొడుకు, కూతురూ కూడా వాళ్ళ స్నేహితులతో చక్కగా అక్కడే ఆడుకుంటున్నారు. వారింటికి వచ్చే బంధువులు కూడా సాయంకాలాలు అక్కడే గడుపుతున్నారు. అదంతా చూస్తున్న జాజితీగ తెగ మురిసిపోతోంది.

కానీ ఆ తీగకు క్రింద తన జన్మస్థలం కేసి చూడాలని కూడా అనిపించటం లేదు. తను పైకి ఎగబ్రాకడానికి తన మొదలులో పాతిన కఱ్ర గురించిగాని దానికి ఆసరగా వేసిన త్రాడు గురించిగాని అది ఏనాడు గుర్తుకుతెచ్చుకోలేదు. ఎందుకంటే పైనుంటేనే ఆనందం క్రిందకు చూస్తే అంతా చీకటి, చివికిపోయిన తాడు పుచ్చిపోయిన కఱ్ర కనిపిస్తాయి.

అయితే ఆ తీగను భూమిలో పాతి దాన్ని దాబాపైకి పాకించిన తోటమాలికి, దాబా ఎక్కి ఆ తీగ సౌందర్యం చూడాలని కోరికుంది. కానీ ఆ అవకాశం లేదు. దాబా ఎక్కాలంటే శరీరం సహకరించటంలేదు. ఆయాసం, నీరసం వస్తున్నాయి. ఎవరూ చేయి అందించి తీసుకెళ్ళేవారు లేరు. అలా నీరసంగా పైకి చూడ్డం తప్ప ఏమీ చేయలేక పోతున్నాడు.

అప్పుడప్పుడూ ఆ ఇంటికొచ్చే జనం ఆ తీగ గురించి దాని పూల వాసన గురించి పొగుడుతుంటే ఆ తోటమాలి వళ్ళు పులకిస్తుంటూంది. కొంతమంది ఆ ఇంటి యజమానిని మెచ్చుకుంటుంటే, కొంతమంది సంస్కారవంతులు ఆ తీగ నాటి పెంచిన తోటమాలికి ధన్యవాదాలు తెల్పాలి అన్నప్పుడు, ఆ తోటమాలి కళ్ళనుండి రెండు ఆనందపు నీటి బొట్లు రాల్తుంటాయి.

-ఎం.మోహనరావు (కాకినాడ)